మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 72 మంగళవారం 19 - 08 - 2025 పేజీలు: 8 వెల: 4

## చిన్నారిని కారులో మరచిపోయి దైవ దర్శనానికి వెళ్లిన తల్లిదండ్రులు




2లో..

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలంటూ

# కూటమి తీర్మానం!

### రాహుల్ గాంధీకి వారం రోజుల అల్టిమేటం జారీ చేసిన సీఈసీ




మన గళం, న్యూఢిల్లీ : ఎలక్షన్ కమిషన్, ఇండియా కూటమి మధ్య వివాదం ముదురుతోంది. రాహుల్ గాంధీకి వారం రోజులు గడువుతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అల్టిమేటం జారీ చేయడంపై ఇండియా కూటమి నేతలు భగ్గుమంటున్నారు. ఈ నేపథ్యంలో సీఈసీని తొలగించాలని పార్లమెంట్ లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీఈసీని పదవిలో నుంచి తొలగించాలంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే పద్ధతే పాటించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

2 లో..



### ప్రజలకు ప్రయోజనకరంగా

# ప్రవర్తించండి

### - ఎంపీలకు స్పీకర్ ఓం బిర్లా హెచ్చరిక

మన గళం, న్యూఢిల్లీ : లోక్‌సభ సోమవారం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025. అయితే, ఈ సందర్భంగా ప్రతిపక్ష ఎంపీలు లోక్ సభలో తీవ్ర గందరగోళం సృష్టించారు. ఒక దశలో నిరసనలు, నినాదాలు మిన్నంటడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2 లో..

# యుద్ధం ముగించాల్సిందే



### - అమెరికా చేరుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ
### - అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూరప్ అగ్రనేతలతో కీలక సమావేశం

మన గళం డెస్క్ : ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నాయి. రష్యాపై ఉమ్మడిగా ఒత్తిడి పెంచి, శాశ్వత శాంతిని సాధించే లక్ష్యంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం వాషింగ్టన్‌లో అడుగుపెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలు యూరోపియన్ అగ్రనేతలతో ఆయన జరపనున్న ఉన్నత స్థాయి సమావేశంపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పర్యటన గురించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో

2 లో..



# కేంద్రమంత్రులతో నారా లోకేష్ భేటీ

- ☐ ఏపీ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చ
- ☐ విజయవాడలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని వినతి

మన గళం, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ ఢిల్లీలో ఇవాళ(సోమవారం) పర్యటిస్తున్నారు. ఏపీ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనులపై పలువురు కేంద్రమంత్రులను లోకేష్ కలుస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో నారా లోకేష్ భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించారు. విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు - మచిలీపట్నం నడుమ ఆరులైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీకి సబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కానూరు - మచిలీపట్నం రోడ్డు విస్తరణ ద్వారా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు రాజధాని ప్రాంత అభివృద్ధికి కూడా ఉపకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ - అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్ హెచ్ - 65 కీలక పాత్ర పోషిస్తుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్ - గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా అదనపు పోర్టు లింకేజిని డీపీఆర్‌లో చేర్చాలని సూచించారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఎన్‌హెచ్ -16 వెంట విశాఖపట్నంలో 20 కిలోమీటర్ల,



2 లో..




### అమిత్ షాతో

# డీకే అరుణ భేటీ!

మనగళం, న్యూస్ నెట్ వర్క్ : తెలంగాణ బీజేపీ కీలక నేత, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఢిల్లీలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను బీజేపీ గూటికి తెచ్చేందుకు అరుణ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షాతో ఆమె భేటీ అయినట్లు తెలుస్తోంది.

# వైఎస్ జగన్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్



మన గళం, అమరావతి : దేశంలో ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే ఎన్డీఏ ప్రభుత్వం ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధకృష్ణన్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని జగన్‌ను రాజ్‌నాథ్ కోరారు. అయితే గతంలో కూడా ప్రధాని ఎన్నికపై జగన్‌కు కేంద్రం నుంచి ఫోన్ వచ్చింది. అప్పుడు తన మద్దతు ప్రధాని మోదీకి తెలుపుతున్నట్లు జగన్ ప్రకటించారు. అయితే తాజా పరిణామల దృష్ట్యా.. జగన్ సపోర్ట్ బీజేపీకి ఉంటుందా..? లేదా అనేది స్పష్టత లేదు. తాజాగా ప్రధాని మోదీపై తన మాటలతో జగన్ విరుచుకుపడ్డ విషయం తెలిసిందే. ప్రభుత్వాలు ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తూ.. అధికారంలోకి వస్తున్నాయని పరోక్షంగా మోదీపై విమర్శలు చేశారు జగన్. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీకి జగన్ సపోర్ట్ చేస్తారా.. లేదా అనేది ఆసక్తికరంగా మారింది.



### కాకాణి కి షరతులతోకూడిన

# బెయిల్

మన గళం, అమరావతి : మైకా అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. కాకాణికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నారు కాకాణి గోవర్ధన్ రెడ్డి. దర్యాప్తు అధికారి దగ్గర పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని కాకాణికి హైకోర్ట్ షరతు విధించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను దాటి వెళ్లడానికి వీల్లేదని కండీషన్ పెట్టింది. ఛార్జిషీట్ దాఖలు చేసే వరకు నెల్లూరు జిల్లాలో అడుగు పెట్టరాదని షరతు

2 లో..

### వాయుగుండంగా బలపడనున్న

# అల్పపీడనం



### - మంగళవారం మధ్యాహ్నానికి తీరం దాటే అవకాశం ఉందన్న ఐఎండీ
### - సెలవులు ప్రకటించిన మూడు జిల్లాల కలెక్టర్లు

మన గళం, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని కేంద్రీకృతమైంది. ఇది పశ్చిమ,

2 లో..



### వైసీపీ తప్పుడు ప్రచారాలపై

# సీఎం ఆగ్రహం

### - తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్న సీఎం చంద్రబాబు

మన గళం, అమరావతి : తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలకు పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు, ప్రజల నుంచి

2 లో..

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలంటూ కూటమి తీర్మానం!

మూడింట రెండొంతుల సభ్యుల మెజారిటీతో పార్లమెంట్ తీర్మానం పాస్ చేయాల్సి ఉంటుంది. మిస్ బిహేవియర్ లేదా సదరు బాధ్యతల నిర్వహణకు అర్హత లేదని నిరూపణ అయితే సీఈసీని పదవి నుంచి తొలగించవచ్చు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అధికార ఎన్డీయే కూటమి ఓట్ల చోరీకి ఎలక్షన్ కమిషన్ సహకరిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్ర వివాదం రేపాయి. ఈ ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఓట్ చోరీ అనే పదం ఉపయోగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించింది. ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించడంతో పాటు డిక్లరేషన్ ఇవ్వాలని రాహుల్ గాంధీని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు ఏడు రోజులు గడువు ఇస్తూ ఆలోగా డిక్లరేషన్ ఇవ్వకుంటే తన ఆరోపణలు తప్పని ఒప్పుకుంటూ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీకి అల్టిమేటం జారీ చేశారు.

## ప్రజలకు ప్రయోజనకరంగా ప్రవర్తించండి



దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకురావడంపై లోక్ సభ స్పీకర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించకుండా ఉండాలని కోరారు. సభను ఉద్దేశించి బిర్లా మాట్లాడుతూ.. 'మీరు నినాదాలు చేస్తున్న ఎనర్జీతో ప్రశ్నలు అడిగితే, అది దేశ ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడకు పంపలేదు. ప్రభుత్వ ఆస్తులను నాశనం చేసే అధికారం ఏ సభ్యునికీ లేదని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. అదే సమయంలో హెచ్చరిస్తున్నాను' అని స్పీకర్ అన్నారు. ఎంపీల తీరు ఇలాగే కొనసాగితే, తాను 'నిర్ణయాత్మక నిర్ణయం' తీసుకోవలసి ఉంటుందని స్పీకర్ హెచ్చరించారు. 'మీరు ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడానికి ప్రయత్నిస్తే, నేను కొన్ని నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. దేశ ప్రజలు మిమ్మల్ని చూస్తారు. అనేక అసెంబ్లీలలో ఇటువంటి ఘటనలకు సభ్యులపై చర్యలు తీసుకున్నారు. నేను మిమ్మల్ని మళ్ళీ హెచ్చరిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడానికి ప్రయత్నించవద్దు. ఇది మీకు నా అభ్యర్థన' అని బిర్లా అన్నారు. ఈరోజు సభ ప్రారంభం కాంగానే ముందుగా, ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ సభ్యులు.. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ప్రాంగణంలో తమ నిరసనను కొనసాగించారు. నిన్న (ఆదివారం) ఎన్నికల కమిషన్ ఈ ఆరోపణలపై స్పష్టత ఇచ్చినప్పటికీ ఇండియా కూటమి సభ్యులు నిరసన కొనసాగిస్తూ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడంతో స్పీకర్ పై విధంగా స్పందించారు.

## యుద్ధం ముగించాల్సిందే

జెలెన్‌స్కీ స్వయంగా వెల్లడించారు. "నేను ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నాను. రేపు ట్రంప్‌తో, యూరోపియన్ నేతలతో సమావేశమవుతాను. ఈ యుద్ధాన్ని వేగంగా, నమ్మకంగా ముగించాలనే బలమైన కోరిక మా అందరిలో ఉంది. అయితే, ఈ శాంతి శాశ్వతంగా ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. గతంలో క్రిమియా, డాన్‌బాస్‌లను వదులుకోవాల్సి వచ్చినట్లుగానో, 1994లో విఫలమైన భద్రతా హామీల వంటిదిగానో ఈ శాంతి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంపై యూరోపియన్ దేశాల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్లకు అనుగుణంగా కొన్ని రాయితీలు ఇచ్చేలా జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి తీసుకురావచ్చని వారు భావిస్తున్నారు. క్రిమియాపై హక్కులను వదులుకోవడం, నాటోలో చేరబోమని హామీ ఇవ్వడం వంటి షరతులకు ఉక్రెయిన్‌ను అంగీకరింపజేసే ప్రయత్నం జరగవచ్చని వారు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వంటి అగ్రనేతలు జెలెన్‌స్కీతో పాటు వాషింగ్టన్ చేరుకున్నారు. ఈ భేటీ ద్వారా అమెరికా వైఖరిని స్పష్టంగా తెలుసుకోవాలని, ఉక్రెయిన్‌కు నమ్మకమైన భద్రతా హామీలు లభించేలా చూడాలని యూరప్ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. "మనం ఇప్పుడు రష్యా ముందు బలహీనంగా కనిపిస్తే, భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలకు పునాది వేసినట్లే అవుతుంది" అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు దీర్ఘకాలిక భద్రతా హామీలు, సైనిక, ఆర్థిక సహాయం కొనసాగింపు, రష్యాపై ఆంక్షల ఒత్తిడి వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉంటాయని జర్మనీ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు, దొనెట్స్క్, సుమీ ప్రాంతాల్లో తమ సైనికులు విజయాలు సాధిస్తున్నారని జెలెన్‌స్కీ గుర్తుచేశారు. ఈ యుద్ధంలో తమకు మద్దతిస్తున్న అమెరికా, మిత్రదేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## కేంద్రమంత్రులతో నారా లోకేష్ భేటీ

విజయవాడలో 14.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ప్లస్ మెట్రో కారిడార్లను నాగపూర్ మోడల్‌లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని వివరించారు. ఇందుకు సంబంధించి ఎన్ హెచ్ఎఐ, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంతో డీపీఆర్ రూపకల్పన, వ్యయాన్ని భరించే అంశంపై చర్చ జరిగిందని చెప్పుకొచ్చారు. ఏపీలో రీజనల్ కనెక్టివిటీ, డెవలప్‌మెంట్ కారిడార్ల అభివృద్ధిలో భాగంగా కర్నూలు - ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ-గుంటూరు నడుమ ఎన్‌హెచ్ 544డీ, కాకినాడ పోర్టు - ఎన్‌హెచ్ 216 నడుమ దక్షిణ రహదారి, కాణిపాక వినాయక దేవాలయం లింకు రోడ్డు నిర్మాణ పనుల చేపట్టాల్సిందిగా కోరారు. బెంగుళూరు - చెన్నయ్ (ఎన్ఇ-7) రహదారికి డైరక్ట్ కనెక్టివిటీ కోసం కుప్పం-హొసూరు - బెంగుళూరు నడుమ 56 కిలోమీటర్ల మేర రూ.3వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అనుమతులు మంజూరు చేయాలని లోకేష్ కేంద్రమంత్రికి విన్నవించారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) ప్రాంతంలో పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు భద్రతా ప్రమాణాల మెరుగుదల, ట్రాఫిక్ రద్దీ నిర్వహణ, లాజిస్టిక్స్, పాసింజర్ కారిడార్ల ఇంటిగ్రేషన్ ఆవశ్యకతను వివరించారు. కేంద్రప్రభుత్వ సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతమైన భూసేకరణకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. స్థిరమైన మోడరన్ కనెక్టివిటీ కోసం గ్రీన్ కారిడార్లు, అధునాతన టోలింగ్, రియల్ టైమ్ ట్రాఫిక్ సమాచార వ్యవస్థల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.



**- నిర్మలా సీతారామన్‌ను కలిసిన నారా లోకేష్...**

అలాగే, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని నారా లోకేష్ కలిశారు. నిర్మలా సీతారామన్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు లోకేష్. ఆర్థిక కష్టాల నుంచి ఏపీ గట్టెక్కేందుకు సహకరిస్తున్నందుకు నిర్మలా సీతారామన్‌కి లోకేష్ కృతజ్ఞతలు చెప్పారు.

## కాకాణి కి షరతులతో కూడిన బెయిల్

విధించింది. మరోవైపు.. క్వార్ట్జ్ అక్రమ రవాణా కేసులో ముద్దాయిగా రిమాండ్‌లో ఉన్నా వైసీపీ నేత బిరదవోలు శ్రీకాంత్ రెడ్డికి అస్వస్థతకు గురయ్యారు. గుండెనొప్పితో నెల్లూరు జీజీహెచ్‌లో చేరారు శ్రీకాంత్ రెడ్డి. రుస్తుం మైనింగ్ కేసులో ఏ-12గా రిమాండ్ ఖైదీగా ఉన్నారు శ్రీకాంత్ రెడ్డి. ఆయనకు గుండె నొప్పి రావటంతో జైలు అధికారులు, వైద్యుని ఆదేశాలతో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో వైద్య పరీక్షలు చేసి ప్రిజనర్స్ వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. స్పెషల్ రూం కావాలని శ్రీకాంత్ రెడ్డి కోరగా జైలు అధికారులు నిరాకరించారు.

## వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం



వాయవ్య దిశగా కదులుతూ ఇవాళ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజుల్లో కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, గుంటూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ విజ్ఞప్తి చేశారు. అల్పపీడన ప్రభావంపై హోంమంత్రి సమీక్ష: పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితి తీవ్రత బట్టి ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్డీఆర్ఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ తగినన్ని బృందాలను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ, ముందస్తు హెచ్చరికల ఆధారంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని హోంమంత్రి సూచించారు. శ్రీకాకుళం, విశాఖ, అల్లూరి జిల్లాలోని విద్యాసంస్థలకు నేడు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల దృష్ట్యా సెలవులు ఈ మూడు జిల్లాల కలెక్టర్లు సెలవు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## వైసీపీ తప్పుడు ప్రచారాలపై సీఎం ఆగ్రహం

వస్తున్న స్పందనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకంపై నిర్వహించిన ర్యాలీలు, ప్రచార కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణ సేవలకు (స్త్రీశక్తి పథకం) అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని పార్టీ విభాగాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. దీనిపై సంతోషం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. ప్రజల్లో పథకాలపై పెరుగుతున్న విశ్వాసం ప్రభుత్వానికి మరింత మేలు చేస్తుందని అన్నారు.

**- వైసీపీ తప్పుడు ప్రచారాలపై ఆగ్రహం**

వైసీపీ, అనుబంధ మీడియా ఉచిత బస్సు పథకం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తోందని పార్టీ వర్గాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చాయి. దీనిపై స్పందించిన చంద్రబాబు నాయుడు.. ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నేతలకు సూచించారు. పథకాల అమలులో ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకం అవ్వడం ద్వారానే ప్రభుత్వ పథకాలకు విశ్వసనీయత పెరుగుతుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## చిన్నారిని కారులో మరచిపోయి దైవ దర్శనానికి వెళ్లిన తల్లిదండ్రులు

నంద్యాల, మన గళం : కారులో భార్య, కుమార్తెతో మహానంది పుణ్యక్షేత్రానికి వెళ్లిన ఓ వ్యక్తి చేసిన పొరబాటుకు అధికారులంతా ఉరుకులు పరుగులు తీశారు. ఏడాదిన్నర వయసున్న చిన్నారిని పొరబాటున కారులోనే మరచిపోయి.. దంపతులు ఇద్దరూ వేర్వేరుగా దర్శనానికి వెళ్లారు. అయితే కారులో నిద్రపోతున్న చిన్నారి డోర్లు అన్నీ మూసి, లాక్ వేసి ఉండటంతో ఊపిరి ఆడక కాసేపటికే లేచి ఏడ్వటం ప్రారంభించింది. గమనించిన స్థానికులు ఆలయ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకెళ్తే.. కర్ణాటకలోని బీజాపూర్‌కు చెందిన రాజు అనే వ్యక్తి, భార్య పిల్లలు, ఇతర కుటుంబసభ్యులతో కలిసి కారులో మహానంది క్షేత్రానికి వెళ్లారు. అక్కడ దైవదర్శనం కోసం వెళ్తూ.. తమ వాహనాన్ని పార్కింగ్‌లో నిలిపారు. అప్పటికే ఏడాదిన్నర వయసున్న తమ చిన్నారి నిద్రిస్తోంది. దీంతో చిన్నారిని భర్త తీసుకొస్తాడని భార్య.. తన భార్య తీసుకెళ్లిందనుకొని భర్త ఇద్దరూ వేర్వేరుగా ఎవరిపాటికి వారు దైవ దర్శనానికి వెళ్లిపోయారు. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో చిన్నారి కారులోనే ఉండిపోయింది. కారు అద్దాలన్నీ మూసి, డోర్‌లన్నీ లాక్ పడిపోవడంతో కారులోపల ఉన్న చిన్నారికి ఊపిరాడక, చెమటలు పట్టాయి. దీంతో నిద్రలేచి ఒక్కసారిగా ఏడుపు లంకించుకుంది.



కారులో చిన్నారి ఏడుపు విన్న స్థానికులు.. వెంటనే దేవస్థానం సిబ్బందికి సమాచారం అందించారు. సమాచార కేంద్రంలోని రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నాగార్జునరెడ్డి వెంటనే కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన అక్కడికి చేరుకుని రాయితో కారు అద్దాలు పగులగొట్టి చిన్నారిని సురక్షితంగా బయటకు తీశారు. అప్పటికే ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న చిన్నారికి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. దేవాలయంలోని మైకుల ద్వారా ఈ విషయాన్ని ప్రకటించగా.. 15 నిమిషాల తర్వాత తల్లిదండ్రులు అక్కడికి వచ్చి చిన్నారిని తీసుకెళ్లారు. చిన్నారిని చాకచక్యంగా కాపాడిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశంసించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## కలెక్టరేట్ లో సువిధ కాంప్లెక్స్ ను ప్రారంభించిన కలెక్టర్




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయ ప్రాంగణం లో నవీకరించిన జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటెన్ తో కూడిన పార్క్, నూతనంగా నిర్మించిన సువిధ శానిటరీ కాంప్లెక్స్ ను సోమవారం జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ సుందరీకరణ నేపథ్యంలో ముఖ భాగంలో జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటెన్ తో కూడిన పార్కు లను నవీకరించడం జరిగిందన్నారు. పార్కు పచ్చదనంతో, ఆహ్లాదంగా ఉండేలా రక రకాల మొక్కలను నాటామని కలెక్టర్ తెలిపారు. అలాగే కలెక్టరేట్ లోని కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం సువిధ కాంప్లెక్స్ ను నిర్మించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆర్ అండ్ బీఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఏవో శివరాముడు , సువిధ శానిటేషన్ సంస్థ అధిపతి సంజయ్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో శాంసంగ్ ల్యాప్‌ట్యాప్ తయారీ మొదలు.. ధరలు తగ్గే ఛాన్స్ ఉందా?




మనగళం దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఇప్పుడు భారతదేశంలో ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభించింది. ఈ చర్యతో భారత్‌లో శాంసంగ్ తయారీ విభాగంలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఉన్న ఫ్యాక్టరీలో ఈ కొత్త ఉత్పత్తి ప్రారంభమైనట్టు సమాచారం. ఇప్పటికే ఈ ప్లాంట్‌లో స్మార్ట్‌ఫోన్లు, ఫీచర్ ఫోన్లు, వేరబుల్స్, టాబ్లెట్లు లాంటి పరికరాలను శాంసంగ్ తయారు చేస్తోంది. ఇప్పుడు ల్యాప్‌టాప్‌లు కూడా ఆ జాబితాలో చేరడం విశేషం.

## తుంగభద్ర డ్యామ్ నుండి నీటి విడుదల

- సుంకేసుల రిజర్వాయర్ కు రెండు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం
- అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలను తెలియజేయండి
- నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : తుంగభద్ర డ్యామ్ నుండి నేడు 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, రేపు ఉదయానికి సుంకేసుల రిజర్వాయరు కు 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో తుంగభద్ర డ్యామ్ నుండి నీటి విడుదలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ నుండి నేడు 90 వేల క్యూసెక్కుల వరకు నీటిని వదిలారని, ప్రస్తుతం కర్నూలు జిల్లా సరిహద్దుగా ఉన్న కౌతాళం మండలం మేళిగనూరు వరకు నీరు వచ్చిందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రాలయం చేరుకునే అవకాశం ఉందని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వీఆర్వో ల ను అప్రమత్తం చేసి గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలను చేరవేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రేపు ఉదయానికి సుంకేసుల కు 90 వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చే అవకాశం ఉందని, భారీ వర్షాలు కురిసిన పక్షంలో 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల వరకు కూడా రావచ్చని, అధికారులు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయరు నుండి 76 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదలుతున్నారని కలెక్టర్ తెలిపారు. కర్నూలు నగరంలో కూడా లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చే అవకాశం ఉందని, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## కనుమరుగవుతున్న పోస్ట్ బాక్స్ లు



మనగళం, కర్నూలు సిటీ: తల్లి వృద్ధాప్యంలోకి వచ్చిందని పట్టించుకోని సంతానం ఎంతోమంది ఉన్నట్టు పెరుగుతున్న టెక్నాలజీ, డిజిటల్ కమ్యూనికేషన్ కారణంగా పోస్ట్ బాక్స్ లు కనుమరుగవుతున్నాయని జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి మన భారత దేశంలో భాగమైన పోస్టల్ శాఖ కీలకంగా వ్యవహరించిన్నారు. పోస్ట్ బాక్స్ లో వేసే ప్రతి ఉత్తరం నూటికి 99% అవతల వారికి చేరువ అయ్యేదన్నారు. గత 180 సంవత్సరాలుగా పైగా భారత దేశంలో భారతీయులకు విడదీయరాని బంధం అనుబంధం ఉందన్నారు. గతంలో టెలిగ్రామ్ వ్యవస్థను రద్దు చేశారు. ఇప్పుడు పోస్ట్ బాక్స్ లు రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ కమ్యూనికేషన్ కారణంగా రిజిస్టర్ పోస్టు, పోస్ట్ బాక్స్ లు వాడకం తగ్గిపోయిందని, ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి సెప్టెంబర్ 1 నుండి రిజిస్టర్ పోస్ట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నదన్నారు. రిజిస్టర్ పోస్ట్ బదులు స్పీడ్ పోస్ట్ విస్తృతం చేస్తున్నట్లు ప్రచారం ఉందని, స్పీడ్ పోస్టు వల్ల గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని వాట్సఅప్ వచ్చినా... ఎన్ని ఇమెయిల్ వచ్చినా... ఎన్ని కొరియర్ సంస్థలు వచ్చినా... పోస్టల్ శాఖ నిర్వహణలో లోపం వల్లనే ఇవన్నీ వెలుగులోకి వచ్చాయని అని తెలిపారు. రేపు వాట్సప్, ఇంటర్నెట్ వ్యవస్థ దెబ్బతింటే ఏంటి పరస్థితి... ఒక్కసారి ఊహించుకుంటేనే భయమేస్తుందన్నారు. పోస్టల్ శాఖ మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలంటే ప్రజలు కూడా పోస్ట్ కార్డులు, పోస్టల్ కవర్లను వినియోగించుకోవాలని కోరారు.

## రోడ్డు పక్కనే 'టిఫిన్ సెంటర్ల'అక్రమ రుచి

- నష్టాల్లో కూరుకుపోతున్న హెూటళ్ల నిర్వాహకులు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలో రోడ్డు పక్కన పెరిగిపోతున్న టిఫిన్ సెంటర్లు... రెస్టారెంట్ యజమానులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అద్దెలు, అడ్వాన్సులు, కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాలు %-% ఇవన్నీ భరించి దుకాణం నడుపుతున్న యజమానులు నష్టాల్లో కూరుకుపోతుంటే, ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్పాత్ ను అక్రమంగా ఆక్రమించి టిఫిన్ సెంటర్లు పెట్టినవారికి ఎటువంటి భారం లేకుండా లాభాలు గడిస్తున్నారు. బుధవారపేట పెట్రోల్ బంక్ నుంచి వినాయక్ ఘాట్ వరకు రోడ్డుపై టిఫిన్ సెంటర్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఉదయం, సాయంత్రం రోడ్డును గుంపుగుంపులుగా ఆక్రమించి టిఫిన్ ఆరగిస్తుంటారు. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

వ్యాపారులకు రెండు రెట్లు భారంలి

దుకాణ యజమానులు నెలసరి అద్దెలతో పాటు భారీ అడ్వాన్స్‌లు, కరెంట్ బిల్లులు, లైసెన్స్ ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. కానీ రోడ్డు పక్కన వ్యాపారం చేసే వారు ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించరు. దీనివల్ల మార్కెట్లో అసమాన పోటీ పెరిగి, కష్టపడి వ్యాపారం చేసే వారికి నష్టాలే మిగులుతున్నాయి.

నాణ్యతకు చెక్ లేదు – రుచికి మసాలా ఎక్కువ

రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్లలో నాణ్యతకు హామీ ఉండదు. నాసిరకం సరుకులు, మళ్లీ మళ్లీ వాడిన నూనె వాడుతూ, రుచిని కప్పిపుచ్చేలా మసాలాలు వేసి విక్రయిస్తున్నారు. తాత్కాలికంగా రుచిగా అనిపించినా, ఆరోగ్యానికి మాత్రం ప్రమాదకరం. కానీ, ఆహార భద్రత విభాగం దీనిపై ఎటువంటి తనిఖీలు చేయకపోవడం ప్రజల్లో ఆగ్రహం పెంచుతోంది.

ట్రాఫిక్‌కు 'టిఫిన్' గండం

రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్ల కారణంగా ఉదయం, సాయంత్రం రెండు పూటలూ ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయాన్నే స్కూల్, కాలేజీ, ఉద్యోగాలకు వెళ్లే ప్రజలకు ఈ సమస్య మింగుడుపడని కష్టంగా మారింది. వినియోగదారులు వాహనాలు రోడ్డు మధ్యలో నిలిపివేయడం, బస్సులు, ఆటోలు అడ్డంగా ఆగిపోవడంతో భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. అదీ కాక ఆ సమయానికి ట్రాఫిక్ సిబ్బంది, సిగ్నల్స్ ఇంకా పని చేయకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

కాలేజీ సమయం – ఆకతాయిల గుంపులు

ఉదయం కాలేజీ సమయాల్లో ఈ టిఫిన్ సెంటర్ల వద్ద ఆకతాయిల గుంపులు చేరి విద్యార్థులపై వ్యాఖ్యలు చేయడం, అనుచిత ప్రవర్తన ప్రదర్శించడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. దీని వలన విద్యార్థినులు, సాధారణ పాదచారులు భయాందోళనలకు గురవుతున్నారు.

అధికారుల దృష్టి ఎప్పుడు?

నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికీ ఈ సమస్యపై సరైన చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు, స్థానికులు ఈ అక్రమ టిఫిన్ సెంటర్లను తక్షణం తొలగించి, నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రియురాలి కోసం ప్రియుడు ఆత్మహత్య

మనగళం, ఎమ్మిగనూరు: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప నగర్ నివాసం ఉంటున్న యువకుడు లలిత్ కుమార్ ప్రియురాల కోసం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లలిత్ కుమార్ తల్లి దండ్రులు ఈరన్న, రాజేశ్వరి వీరికి ముగ్గురు అమ్మాయిలు ఒక కుమారుడు. ఉన్న ఒకగాన ఒక కుమారుడు ఆత్మహత్య చేసుకోవడం తో కుటుంబ సభ్యుల రోధన చూపరుల కంట తడి పెట్టిస్తుంది. లలిత్ కుమారు ఆదోని పట్టణంలో ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాల లో చదువుతూ...మధ్యలోనే మానేశారు. లలిత్ కుమారు ఎమ్మిగనూరు పట్టణం లో ఓ అమ్మాయి ని ప్రేమించేవాడని, ఆ అమ్మాయి లలిత్ కుమార్ ప్రేమను నిరాకరించడం తో మనస్తాపానికి గురై ఇంట్లో పంచ తో ఉరి వేసుకొని తనువు చాలించారు.

## విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



- వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్ అధికారులు

మనగళం, కర్నూలు సిటీ : వర్షాలు జోరుగా కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ఈ మేరకు ప్రజలకు సూచనలు వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా రెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షపు వేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాల దగ్గర గుమికూడదని సూచించారు. తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్/ఆఫ్ చేయకూడదన్నారు. ఇళ్లలో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్తపడాలి. వర్షాకాలంలో ఇంటి వద్ద ఇనుప రాడ్లు, సిమెంట్ రాడ్లు, టిన్ షీట్లు వంటివి బహిరంగ ప్రదేశాల్లో ఉంచకూడదన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడివుంటే, వాటిని తాకకూడదు. వెంటనే 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలి. వర్షంలో తెగి పడిన తీగలు, చెట్లపై పడివున్నా, వాహనాలపై పడివున్నా దగ్గరగా వెళ్లకుండా 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇళ్లలో ఎలక్ట్రిక్ పరికరాలు వాడిన తర్వాత స్విచ్ ఆఫ్ చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపు నీటితో నిండిన ప్రదేశాలు, పొలాలు, రోడ్లలో ఉన్న ఎలక్ట్రిక్ లైన్ల దగ్గర తిరగకూడదన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాల దగ్గర గుడారాలు, షెడ్లు, టెంట్లు వేయకూడదు. పిల్లలు ఎలక్ట్రిక్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఆటలాడకూడదు. వర్షాకాలంలో ఇంటి లోపలికి వచ్చే కరెంట్ షాక్‌లను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఫ్యూజ్ లైన్లు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి. తడి బట్టలు, తడి చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లను తాకవద్దు. వర్షాకాలంలో మోటార్ వాడకం తగ్గించాలి. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ 1912 నంబర్‌కి కాల్ చేయండి.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మనగళం, కర్నూలు క్రైం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశార.. న్యాయం చేయండి

ప్రభుత్వ పాఠశాలలలో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి విజయవాడ కు చెందిన ఎంద్రపల్లి శివ , కోయిల కుంట్ల కు చెందిన మధ్యవర్తి రామకృష్ణ కలిసి నకిలీ ఉద్యోగాలు ఇప్పించి మోసం చేశారని పత్తికొండ మండలం, పులికొండ గ్రామం కు చెందిన రాజశేఖర్, నరేష్, లింగరాజు, పీటర్ పాల్ , చైతన్య లు ఫిర్యాదు చేశారు. ఏలూరు లో ట్రైనింగ్ ఇచ్చి, ఆలూరు లో 6 నెలల పాటు పని చేయించుకుని మొత్తం 5 మంది నుండి ఒక్కొక్కరి నుండి రూ. 2 లక్షల నుండి రూ. 4 లక్షల వరకు డబ్బులు తీసుకొని మోసం చేశారని, న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. తన కుమారుడిని.... కోడలు, కోడలు బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూల్ గణేష్ నగర్ కు చెందిన అజ్మత్ ఖాన్ ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దేవదానం, జ్యోతి అనే వ్యక్తులు రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశారని కౌతాళం మండలం, చిరుతపల్లి గ్రామంకు చెందిన రాజు, మునిస్వామి లు ఫిర్యాదు చేశారు. కోడలు, కొడుకు మమ్మల్ని కొట్టి పొదుపు లో వచ్చిన డబ్బులు, బంగారం తీసుకెళ్లారని తుగ్గలి మండలం, గుండాల్ తాండకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు. నాకు ముగ్గురు పిల్లలు. మా సొంత తమ్ముడు శివరాజ్ మద్యానికి బానిసై, తల్లిదండ్రులు ఇచ్చిన నా ఆస్తి భాగాన్ని నాకు తెలియకుండా వేరే వాళ్ళకు అమ్మినాడని న్యాయం చేయాలని ఆదోని, స్వామి రెడ్డి నగర్ కు చెందిన తిరుపాలు ఫిర్యాదు చేశారు. బాబు అనే వ్యక్తి ....నా అంగడి ముందు కూరగాయల బండి పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేయాలని కర్నూలు, చౌక్ మసీదు కు చెందిన నజీర్ అహమ్మద్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ లు పాల్గొన్నారు.

# బార్ ల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం




మనగళం, కర్నూలు క్రైం : కొత్త బార్ ల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్రహాస్ కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుధీర్ బాబు మాట్లాడారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో 18-8-2025 నుండి 26-8-2025 వరకు దరఖాస్తు లు స్వీకరణ ఉంటుందన్నారు. 28-8-2025 తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ లాటరీ నిర్వహించి బార్ దరఖాస్తుదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. వారికి లైసెన్స్ లను మంజూరు చేస్తామన్నారు.

సమూల మార్పులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త బార్ పాలసీ : రాష్ట్రవ్యాప్తంగా బార్ల కేటాయింపు మరియు నిర్వహణలో పారదర్శకత, న్యాయబద్ధత, వ్యాపార ఆర్థిక స్థిరత్వంతో మేళవించిన కొత్త బార్ పాలసీ. కర్నూలు జిల్లాలో (23) బార్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. కొత్త బార్ పాలసీ ముఖ్య లక్షణాలు: జిల్లా కలెక్టర్ డ్రా పద్ధతి ద్వారా బార్స్ ఎంపిక. రూ 5,00,000/- తగ్గించబడిన దరఖాస్తు రుసుం. వేలాలకు బదులుగా పారదర్శక లాట్ల డ్రా ద్వారా బార్‌లను కేటాయింపు. అప్లికేషన్ కి రూ.5 లక్షల ఫీజు ం రూ.10,000 ప్రాసెసింగ్ ఫీజు. కొత్త విధానం అన్ని అడ్డంకులను తగ్గిస్తుంది. న్యాయం, పోటీతత్వాన్ని నిర్ధారించడానికి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు అవసరం. రిటైల్ దుకాణాలతో పోలిస్తే తక్కువ లైసెన్స్ ఫీజు : రూ. 35 లక్షలు ( 50,000 వరకు జనాభా),రూ.55 లక్షలు (50,00 పైబడి %-%5 లక్షల వరకు జనాభా), రూ.75 లక్షలు ( 5 లక్షల పైబడి జనాభా). పొడిగించిన వ్యాపార సమయాలు: బార్లు ఉదయం 10:00 నుండి అర్ధరాత్రి 12:00 వరకు (14 గంటలు) అనుమతి. సౌకర్యవంతమైన లైసెన్స్ ఫీజు చెల్లింపు నిబంధనలు. లైసెన్స్ రుసుమును 6 సమాన వాయిదాలలో/ ఇన్స్టాల్మెంట్స్ చెల్లించవచ్చు. ఒక ఇన్స్టాల్మెంట్ కి సరిపడా బ్యాంక్ గ్యారెంటీ ఇస్తే చాలు. ఏ4 దుకాణాలతో పోటీ పడేలా ( లేవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ) వ్యాపారం. బార్లు కూడా ఏ4 దుకాణాల మాదిరిగానే ఏపీఎస్ బీసీఎల్ నుండి స్టాక్‌ను కొనుగోలు. అలెర్ట్ చెల్లింపులు బ్యాంక్ గ్యారెంటీ ఇది. ముందుగా ఉన్న రెస్టారెంట్ తప్పనిసరి కాదు. లైసెన్స్ పొందినవారు లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.

కొత్త విధానం యొక్క ముఖ్య ప్రయోజనాలు: లాటరీ ద్వారా పారదర్శకతను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుంది. తక్కువ ఖర్చులు ముఖ్యంగా కొత్త వ్యవస్థాపకులకు ఎంతో ఈజీ ఆఫ్ డూయింగ్. తగ్గిన రుసుములు, వాయిదాల చెల్లింపు సౌకర్యంతో ఆర్థికంగా వ్యాపారం స్థిరంగా ఉంటుంది. పొడిగించిన పని గంటలు వ్యాపార సాధ్యత, వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయి. పట్టణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో కార్పొరేషన్ లో 10 కిలోమీటర్లు, మునిసిపల్ ఏరియాలో 3 కిలోమీటర్లు బెల్ట్ ఏరియాలో బార్స్ ఏర్పాటు కు అందరికి సమాన అవకాశాలు. తద్వారా న్యాయమైన పోటీతో కూడిన వ్యాపారం.

# గడువు లోపు అర్జీలను పరిష్కరించకుంటే చర్యలు

– అర్జీల పరిష్కారంలో ప్రజల నుండి సానుకూల స్పందన ఉండాలి – జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : నిర్ణీత గడువు లోపు అర్జీలను పరిష్కరించక పోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని చెప్పినప్పటికీ ఆదోని మున్సిపల్ కమిషనర్ వద్ద 5, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, కర్నూలు వద్ద 2, ఇన్స్పెక్టర్ వక్ఫ్ బోర్డు, కర్నూలు వద్ద 1 అర్జీ పరిష్కరించలేదని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మను ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోందని, కొంతమంది అధికారులపై ప్రజల నుండి వ్యతిరేక స్పందన వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అధికారులు ప్రజలతో బాగా మాట్లాడి వారి సమస్యలను గడువు లోపు పరిష్కరించి ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు చూడాలని, నగరం లోని వార్డు ప్లానింగ్ %ಡ% రెగ్యులేషన్ సెక్రెటరీ వద్ద 18 రోజుల నుండి 1 అర్జీ పెండింగ్ లో ఉందని, సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ ను ఆదేశించారు. అదేవిధంగా బంగారు కుటుంబాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయి అని చేసే నీడ్ అసెస్మెంట్ సర్వేలో అని మండలాలు 99 శాతం పనులు పూర్తి చేస్తే గూడూరు మండలం మాత్రం కేవలం 85 శాతం చేశారన్నారు. గూడూరు మున్సిపాలిటీ లో కేవలం 600 ఉన్నప్పటికీ, ఇంకా 120 పెండింగ్ లో ఉండడం ఏంటని కలెక్టర్ గూడూరు మున్సిపల్ కమిషనర్ ను ప్రశ్నించారు. త్వరితగతిన సర్వే పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి

– మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణపై ప్రజలకి అవగాహన కల్పించండి
– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : దోమల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో ఆగస్టు 20 వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్ ను జాయింట్ కలెక్టర్ డా. బి .నవ్య, డీఆర్ఓ సి .వెంకట నారాయణమ్మ, డీఎంహెచ్ఓ డా. శాంతి కళ, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజుతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది "మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియా పై పోరాటాన్ని వేగవంతం చేయడం" అనే థీమ్ తో ప్రపంచ దోమల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నీటి నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మురుగు కాలువలో నీరు బ్లాక్ అయిన పక్షంలో వెంటనే శానిటేషన్ సిబ్బందితో క్లీన్ చేయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపిఓ, మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. 0 నుండి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు, గర్భవతులకు ఎవరికైనా జ్వరం లాంటివి ఉంటే వారిని దగ్గరగా ఉండే ఆరోగ్య కేంద్రాలకు తీసుకొని వెళ్లాలని కలెక్టర్ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే - డ్రైడే" ను పాటించి దోమల నివారణకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.




# ఘనంగా ప్రమాణ స్వీకారం





మనగళం, గడివేముల : గడివేముల మండల ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ గా దేశం సత్య నారాయణ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాణ్య%శీ% ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్ తో భారీ గజ మాలతో ఘన స్వాగతం పలికారు. భారీ జనస%శీ%ద్రోహం తో సొసైటీ ఆఫీస్ వరకు ర్యాలీ గా వెళ్లారు. నూతన సొసైటీ కార్యాలయం, వ్యవసాయ గోడౌన్ ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతన సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ప్రసంగించారు. కార్యక్రమం లో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, తహసీల్దార్, ఎంపిడిఓ, పలు శాఖల అధికారులు, కూటమి పార్టీ ల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జియోలో రూ.189 చౌకైన ప్లాన్.. డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, వ్యాలిడిటీ ఎంతో తెలుసా?




మనగళం, లయన్స్ జియో తన ప్రీపెయిడ్ పోర్ట్‌ఫోలియోకు కొత్త, చాలా సరసమైన ప్లాన్‌ను జోడించింది. బడ్జెట్ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాన్ ప్రారంభించింది. రూ. 189 ధర గల ఈ ప్లాన్‌లో కస్టమర్‌లు అపరిమిత కాలింగ్, 2%+దీ% హై స్పీడ్ డేటా, 300 ఉచిత లను 28 రోజుల పాటు పొందుతారు. తక్కువ ధరతో నెల మొత్తం తమ ఫోన్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే వారికి ఈ ప్లాన్ ఉత్తమమైనది. జియో ఈ ప్లాన్ కాలింగ్, తక్కువ డేటాను ఉపయోగించే వారికి మాత్రమే కాకుండా కంటెంట్‌ను ఇష్టపడే వారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జియో టీవీ, జియో క్లౌడ్‌లకు ఉచిత యాక్సెస్‌ను అందిస్తుంది. ఇది ఎంటర్‌టైన్‌మెంట్, డిజిటల్ స్టోరేజీ అవసరాలను కూడా తీరుస్తుంది. ఈ వాల్యూ ప్యాక్ ప్రత్యేకంగా సెకండరీ సిమ్ ఉన్న లేదా తక్కువ ఇంటర్నెట్‌ను ఉపయోగించే కస్టమర్ల కోసం రూపొందించినట్లు కంపెనీ చెబుతోంది. ఈ ప్లాన్ వినియోగదారులకు రూ.189కి మాత్రమే అందుబాటులో ఉంది. రూ.189, మీరు 28 రోజుల అపరిమిత కాలింగ్, డేటా, ఉచితలను పొందుతున్నారు.

మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

# సంపాదకీయం

దళిత రాజకీయ సాధికారిత ఏదీ?

దేశవ్యాప్తంగా రాజకీయ వేదికలలో దళితుల ఉనికి పెరిగింది. కానీ ఈ కనిపించే ఉనికి, దళిత రాజకీయ అధికార గొంతుగా మారలేదు. చాలా మటుకు రాజకీయ పార్టీలు దళిత నాయకులను నామమాత్ర ప్రాతినిధ్యానికే పరిమితం చేశాయి. ఇంకా చేస్తూనే ఉన్నాయి. ఏ పార్టీలోనూ దళితులు నిర్ణయాత్మక స్థానాల్లో లేరు. ఒకటి అర పార్టీలలో ఉన్నప్పటికీ వారికి నిర్ణయాధికారం ఉండదు, గౌరవం ఉండదు. ఒకవేళ ఏదైనా ప్రత్యేక పరిస్థితిలో ఏదైనా రాజకీయ పార్టీలో దళితుడు నిర్ణయాధికారం కలిగి నిర్ణయాత్మక స్థానంలోకి చేరుకుంటే ఆ నాయకుడికి దళిత స్పృహ కంటే దొరల స్పృహ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితి పార్టీలకే పరిమితం కాకుండా, ఆయా పార్టీలచే ఏర్పడిన ప్రభుత్వాలలో కూడా కొనసాగుతుంది. దళిత అభ్యర్థులు ఎన్నికల్లో సీటు పొందాలన్నా, ఆ తర్వాత గెలవాలన్నా అగ్రకులాల దయాదాక్షిణ్యాలు కావాలి. దీనికి ప్రధాన కారణం దళిత నాయకులను దళితులే ఎన్నుకొనే అవకాశం కోల్పోవటమే, పైగా దళిత నాయకులు ఇతరుల స్వార్థాలకు అనుగుణంగా ఎంపిక చేయబడటమే. దీనివల్ల దళిత సమాజ అభివృద్ధి కోసం పనిచేయాల్సిన దళిత నాయకులు అగ్రకుల నాయకుల ఆశీర్వాదాల కోసం ఆరాటపడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి నిజాయితీగల దళిత నాయకులను అయోమయ స్థితిలోకి నెట్టివేస్తున్నది. ఇది ప్రస్తుత దళిత రాజకీయ చైతన్యానికి ఒక ముఖ్యమైన పార్శ్వం.

ఇప్పటి దళిత ఉద్యమాలు అంతర్గతంగా, బాహ్యంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దళిత విముక్తి, కుల వ్యవస్థ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటం వంటి విస్తృత లక్ష్యాలు నేడు చీలికల వల్ల, అంతర్గత విభేదాల వల్ల మరుగునపడిపోయాయి. ఉద్యమంలోని విభజనలు అనేక రకాల పెడధోరణులను ముందుకు తెచ్చింది. పరస్పర విరుద్ధమైన లక్ష్యాలతో, వ్యూహాలతో దళిత ఉద్యమం దాని విప్లవాత్మక తేజస్సును కోల్పోయింది. రాజకీయ అధికార ఆకాంక్షలు కూడా చీలికలకు దారితీశాయి. పార్టీలు పెట్టే ప్రలోభాలతో దళిత నాయకుల మధ్య పోటీ తీవ్రమైంది. ఈ పరిస్థితిలో దళితులు పార్టీలవారీగా వేరైపోయారు. దళితుల మధ్య ఈ చీలికలు ఒక లోతైన వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాజకీయ పార్టీల సిద్ధాంతాలకు, అగ్రకుల నాయకత్వానికి అంకితమై వ్యక్తిగత అభివృద్ధికి, అవకాశాల కోసం ఎదురు చూడటం ఒక వైపు కనిపిస్తుంది. మరోవైపు అశేష దళిత సమాజాలు తాము ఎదుర్కొంటున్న దౌర్భాగ్యం, అన్యాయం, ఆకలి, హింసలపై వ్యక్తం చేస్తున్న నిస్సహాయత, ఆందోళన కనిపిస్తాయి. రిజర్వేషన్ల లబ్ధిదారులైన మధ్యతరగతి దళితులు, దళిత మేధావులు కుల వ్యవస్థ అణచివేతను విస్మరించారు. ప్రాథమిక స్థాయి దళిత జనంలో మార్పును తేవడానికి దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందించటానికి బదులు%-% రిజర్వేషన్లు, ఉద్యోగాల వంటి పరిమిత లాభాలపై వీరు దృష్టి కేంద్రీకరించారు.

దళిత సమూహాలకి సంయుక్త ప్రతీకలు, భాషాయాసలు, విలువలు లేకపోవడం వివిధ దళిత సమాజాల మధ్య విభేదాలను తీవ్రతరం చేస్తోంది. పార్లమెంటరీ రాజకీయాలు వ్యక్తిగత గుర్తింపునకు ప్రాధాన్యతనిస్తూ, దళిత జాతి ఉపకులాల మధ్య విభేదాలను ప్రోత్సహించాయి. ఫలితంగా దళితులు తమ పోరాటాల నుంచి వేరై రాజకీయ పార్టీలపై ఆధారపడే స్థితికి చేరుకున్నారు. ఈ పరిణామం దళిత ఉన్నత వర్గాలకు అనుకూలంగా మారి, వ్యక్తిగత స్థాయిలో వారు అధికారాన్ని, సౌకర్యాన్ని పొందే వీలు కల్పించింది. అందువల్ల వారు దళిత సమాజంపై కొనసాగుతున్న వ్యవస్థాపిత అన్యాయాలను ప్రశ్నించటం మానేశారు. అంబేద్కర్‌ను ఒక చిహ్నంగా మారుస్తున్న తీరూ సమస్యాత్మకమే. ఆయన పోరాట చైతన్యాన్ని ఒక విగ్రహంగా మార్చి వేశారు. ఆయన కుల నిర్మూలనా సిద్ధాంతానికున్న విప్లవాత్మక లక్షణాన్ని విగ్రహారాధనగా మార్చివేసారు.

దళిత నాయకత్వ సామర్థ్యాన్ని నిర్మాణంలోని పరిమితులు నిరోధిస్తున్నాయి. ప్రధాన రాజకీయ వ్యవస్థ దళిత నాయకత్వంలోని కొన్ని వర్గాలను తనలో కలుపుకొని, దళిత ఉద్యమ విప్లవాత్మక లక్ష్యాలను నీరుగార్చుతూ, ఉద్యమ స్వతంత్ర పోరాట లక్ష్యాలకన్నా పార్టీ రాజకీయాల మీద ఆధారపడే పరిస్థితిని సృష్టించింది. ఎన్నికల పరిమితులు, పార్టీలతో అనుబంధాలు ఉద్యమాన్ని విభజించి, కలిసికట్టుగా పనిచేసే శక్తిని దెబ్బతీస్తున్నాయి. అంతేగాక, దళిత నాయకత్వం ఎక్కువగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల రాజకీయాలకు పరిమితమై, వ్యవస్థాపిత అసమానతలను ఎదుర్కొనేలా, విస్తృతమైన సామాజిక%-%ఆర్థిక మార్పును సాధించేలా దృష్టిని మళ్లించడంలో విఫలమవుతోంది. అణగారిన వర్గాల అభివృద్ధికి అనుకూలంగా రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొందిన మధ్య తరగతి దళిత సముదాయం తరచుగా ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలకు ప్రోత్సాహం ఇవ్వడంలో విఫలమవుతున్నది. ఇది దళిత నాయకత్వానికీ అశేష సామూహిక దళిత జనాభాకి మధ్య విబేధాన్ని పెంచుతున్నది. దళితులు రాజకీయంగా లెక్కలోకి రావాలంటే, దళిత నాయకత్వం శక్తిమంతమైన రాజకీయ చర్యగా నిలవాలంటే, అది ఎన్నికల పరిమితులను అధిగమించి, ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలను బలోపేతం చేయడం, భావజాల ఐక్యతను పెంపొందించడం, కుల ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను నిర్మించడం అవసరం. అంతేకాక, దళిత కులాల మధ్య %-% దళిత ఉద్యమాల మధ్య ఐక్యతను పెంపొందించడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, అంబేద్కర్ విప్లవాత్మక దృష్టిని కేవలం ప్రతీకాత్మక గుర్తింపుగా కాకుండా ఒక కార్యాచరణ మార్గంగా మార్చుకోవడం కీలకం. ఈ మార్గంలో మాత్రమే మరింత బలమైన, దృఢమైన దళిత రాజకీయ ఉద్యమాన్ని నిర్మించవచ్చు. ఒక సమగ్ర ప్రణాళిక ద్వారా మాత్రమే దళిత నాయకత్వం వ్యవస్థాపిత అణచివేతను పూర్తిగా విచ్ఛిన్నం చేసి, దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ మార్పును సాధించగలదు.



## రత్నమ్మ మృతికి సంతాపం

మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ 30 వ వార్డ్ కి చెందిన టీడీపీ కార్యకర్త భాస్కర్ రెడ్డి తల్లి రత్నమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గం ఇన్చార్జి రత్నమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## డోన్ పట్టణంలో డ్రంక్ - డ్రైవ్ కేసులపై కోర్టు కఠిన చర్యలు తీసుకుంది.

మన గళండోన్ రాజశ్రీ ఎస్. అనిల్ కుమార్ కోర్టులో విచారణకు వచ్చిన, డోన్ టౌన్ పోలిస్ స్టేషన్ కు సంబంధించిన 04- కేసులలో నిందిత బైక్ రైడర్లకు ఒక్కొక్కరికి రూ.10,000/- జరిమానా లేకపోతే ఒక నెల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ఒక తీవ్రమైన నేరం.ఇలాంటి చర్యలు డ్రైవర్ ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడతాయి. ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించినా, వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవు. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. డోన్ టౌన్ పోలీసులు ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం, ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని గట్టిగా హెచ్చరిస్తున్నాము అని పోలీసులు తెలిపారు.

## అవుకు కు చేరుకున్న పెనుగొండ అమ్మవారి పాదుకలు ..

మన గళం అవుకు : ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయినా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పాదుకలు పెనుగొండ నుంచి అవుకు కు శ్రావణ సోమవారం చేరుకున్నాయి.అవుకు కు వచ్చిన అమ్మవారి పాదుకలకు ఆర్యవైశ్య మహిళలు , ఆర్యవైశ్యులు గణ స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారికి ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు మాట్లాడుతూ శ్రావణమాసంలో తమ కులదైవమైన వాసవి మాత పాదుకలు తమ ఊరికి రావటం శుభపరిణాము ఆని అన్నారు.



## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**- ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్**



మనగళం, కర్నూలు సిటీ : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. సోమవారం ఉదయం సి. క్యాంపు, బళ్ళారి చౌరస్తా, రాజ్ విహార్ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని వాటికి జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వ్యక్తులను ఆపి, అరగంటపాటు సమయం ఇచ్చి హెల్మెట్ లు తెచ్చుకున్న తర్వాత రోజా పూవ్వు ఇచ్చి పంపించారు. హెల్మెట్ ధరించని 150 మంది పై జరిమానాలు విధించారు.

## నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి శబరి



మనగళం, న్యూస్ నెట్ వర్క్ : ఢిల్లీలోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను సహచర పార్లమెంట్ సభ్యులతో కలసి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ పర్యటనలో లోకేష్ కేంద్ర మంత్రులను కలుస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారు.

## కోడుమూరు మండలంలో దాదాపు 30 మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అధికారులు తప్పిదమే అంటున్న దివ్యాంగులు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి సురేష్ నాయుడు అధ్యక్షతన కోడుమూరు ఎంపీడీవో ఏసీ రాముడును దివ్యాంగులంతా కలిశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు మండలంలో దాదాపు 30 మందికి దాకా పింఛన్లు నిజమైన దివ్యాంగులకు తొలగించడం జరిగినది ఇది ముమ్మాటికి అధికారుల తప్పిదమే కావున మరొక్కసారి రీ సర్వే సదరముకు పంపించి వాళ్ళ పింఛన్లు వచ్చేటట్లు చేయమని ఎంపీడీవోను ఈ సందర్భంగా కోరడం జరిగినది దివ్యాంగులంతా కలిసి వినతి పత్రాన్ని ఎంపీడీవో అందజేశారు వారు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం కోడుమూరు మండల అధ్యక్షుడు పీ రాజశేఖర్ కార్యదర్శి రుబీనా కృష్ణవేణి గోరంట్ల సురేష్ గోరంట్ల మాదన్న మొదలైన వారు పాల్గొన్నారు



## ట్రంప్ టారిఫ్ విధానాలని వ్యతిరేకించాలి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

మన గళం కోడుమూరు: దేశంలోని రైతులపై కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను దొడ్డి దారిలో తీసుకొని రావడానికి ప్రయత్నిస్తోందని సిపిఐ పట్టణ కార్యదర్శి శేషు కుమార్, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి చిన్న రాముడు, హమాలీ సంఘం కార్యదర్శి విశ్వనాథ్ విమర్శంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు కొళాయిల రాముడు అధ్యక్షతన కోట్ల సర్కిల్ లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఇండియా లో 50/ టారిఫ్ లు మోపడానికి సిద్ధమాయ్యారని,దీనిని వ్యతిరికించకుండా ప్రధాని మోడీ మౌనంగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని వారు విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ చట్టాలని స్వదేశీ, విదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారం ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేస్తే సాహించేది లేదన్నారు.ఎరువుల పరికరాలపై సబ్సిడీలపై కోత విధించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. 10 సంవత్సరాలు దాటిన ట్రాక్టర్లపై నిషేధం విధించి, ఎఫ్సిఐ తదితర గోడౌన్లను ఆధాని కి అప్పగించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. మనం దిగుమతి చేసే వస్తువులపై పన్నులు తగ్గించాలని, మన దేశం ఎగుమతి చేసే వస్తువులపై పన్నులు పెంచాలని ట్రంప్ భాహిరంగగానే ఒత్తిడి చేస్తున్నా, అనేక



దేశాలు వ్యతిరేకిస్తున్నా మోడీ ప్రభుత్వం ఎదురు చెప్పకుండా చర్చలు సాగించడాన్ని ఎంత వరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వర్కర్ సిపిఐ గ్రామ కార్యదర్శి మునిస్వామి, ఎపి రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి గోవిందు, హమాలీ సంఘము కార్మికులు మద్ది, చిన్న బజారి,మద్దిలేటి, దాము, అభి,నాగేష్,తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్ సమావేశానికి వస్తుంటారని, నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు.

అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు

1. కొలిమిగుండ్ల మండలం, మదనంతపురం గ్రామానికి చెందిన ఎస్. పెద్ద శేఖర్ తనకు సొంత ఇల్లులేదని, ఇంటి స్థలం మంజూరు చేయించగలరని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు

2. ప్యాపిలి మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పి.మద్దయ్య సర్వే నెంబర్ 81/65లో ఎకరా భూమి తన పేరు మీద ఉంది. ఈ భూమిని రీసర్వే



చేయగా రీ సర్వేలో ఎకరా కంటే తక్కువగా చూపిస్తూ హద్దులు నాటారు. తన భూమి తనకు ఖచ్చితమైన హద్దులు చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.

3. గడివేముల మండలం, గడివేముల గ్రామానికి చెందిన కత్తి శ్రీనివాసులు తనకు వస్తున్న వికలాంగుల పెన్షన్ ను తొలగించారని, పెన్షన్ పునరుద్ధరించాలని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమసమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతులు అందజేశారు.

# అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల: ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి. అవయవ దానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి జీవితంలో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో... జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గత జూన్ మాసంలో మొట్టమొదట అవయదానం చేసిన మహిళ బోప్ప సుజాత కుటుంబ సభ్యులకు 50 వేల నగదు పారితోషకం, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నంద్యాల మండలం గుంతనాల గ్రామ నివాసి బొప్పా సుజాత గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండేవారు. గత జూన్ నెల ఒకటో తారీఖున ఆమె రోడ్డు ప్రమాదనికి గురవ్వగా.. తనను బతికించడం కోసం డాక్టర్లు తీవ్రంగా కృషి చేశారు. అయినా ఆమె బ్రెయిన్ డెత్ కు కావడంతో వారి సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబ సభ్యులను అవయవ దానం కోసం ఒప్పించి రెడ్ క్రాస్ ను సంప్రదించారు. ఈ మేరకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన అవయవ దానము చేయించి ఏడు మంది జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి నగదు పారితోషికంగా 50వేల రూపాయలు కలెక్టర్ అందజేయడంతో పాటుగా




డాక్టర్ విజయా, ఆమె సోదరునికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అవయవ దానం చేసిన బొప్పా సుజాత సోదరి డాక్టర్ విజయ మాట్లాడుతూ... అవయవ దానంపై చాలామందికి అపోహలు ఉన్నాయన్నారు. మన కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల తమ మనుషులు బ్రతికి ఉన్నారన్న సంతృప్తి కలుగుతుందన్నారు. తన సోదరి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నా... ఏ విధంగా ముందుకు వెళ్లాలో తోచలేదని.. ఆ సమయంలో రెడ్ క్రాస్ ను సంప్రదించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసి సి విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

**- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

మనగళం, బనగానపల్లె : కూటమి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. బనగానపల్లెలో కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) మంత్రి తనిఖీ చేశారు. క్లాస్ రూమ్ లను పరిశీలించిన మంత్రి బోధన, ఆహారం, వసతి తదితర సదుపాయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారా... లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం ఇస్తున్న స్కూల్ బ్యాగులు, డ్రెస్ ల నాణ్యతపై మంత్రి విద్యార్థినులతో ఆరా తీయగా గతంలో కంటే బాగున్నాయని చెప్పారు. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగారు. తాగునీటి సదుపాయం, వాటర్ ప్లాంట్ పనితీరును మంత్రి పరిశీలించారు. అదేవిధంగా స్టోర్ రూమ్ లో ఆహార సామాగ్రి నాణ్యతను, కిచెన్ రూమ్ ను పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. పరిసరాల శుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుత కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని రూ. 2.5 కోట్ల నిధులతో అదనంగా మరో 6 నూతన రూమ్ లు నిర్మించి, జూనియర్ కాలేజీగా విస్తరించనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.



## అన్నింటిని వెనక్కి నెట్టి నంబర్ 1గా నిలిచిన ఎలక్ట్రిక్ స్కూటర్!

మనగళం, ఓలా ఎలక్ట్రిక్ మూడవ స్థానంలో ఉంది. కంపెనీ అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 57.29 శాతం తగ్గి కేవలం 17,852 యూనిట్లకు చేరుకున్నాయి. గతంలో ఎలక్ట్రిక్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయించిన ఓలా ఈసారి కఠినమైన సవాలును ఎదుర్కొంది. అలాగే.. భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్లకు డిమాండ్ రోజురోజుకూ వేగంగా పెరుగుతోంది. కానీ జూలైలో ఏ స్కూటర్ అత్యధికంగా అమ్ముడైందో మీకు తెలుసా? ఈ కాలంలో దేశంలోని పెద్ద కంపెనీలు బలమైన అమ్మకాలను నమోదు చేశాయి. దీనిలో మొదటి పేరు టీవీఎస్. ఇది అమ్మకాలలో అన్ని ఈవీలను వెనుకేసింది. కేవలం రూ.895 ప్లాన్‌తో 11 నెలల వ్యాలిడిటీ..జియోలో బెస్ట్ ప్లాన్

## రెండో రోజు తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరాయంటే



మనగళం, దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అయినప్పటికీ 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకుపైగా (%ప్రశ్రీస ఖఅస ంఅశ్రీజవతీ జూతీఱవెవ నతీశీజూ ాబస్త్రబర్ 1౯ష్ట్ర% 2025) ఉంది. ఈ క్రమంలో ఆగస్ట్ 18, 2025న ఉదయం 6.30 గంటల నాటికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,01,170కి చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 92,740 స్థాయిలో ఉంది. నిన్నటి ధరలతో పోలిస్తే బంగారం ధరలు స్వల్పంగా రూ. 10 తగ్గాయి. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ.100 తగ్గి, రూ. 1,16,100 వద్ద ఉంది. అయితే, ఇతర ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఇక్కడ తెలుసుకుందాం.

ఇతర నగరాల్లో బంగారం, వెండి ధరలు

మరోవైపు హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,170గా ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 92,740గా ఉంది. వెండి ధర కిలోగ్రాముకు రూ. 1,26,100గా నమోదైంది. ఇది ఢిల్లీలో (రూ. 1,16,100) కంటే అధికం. ముంబై, బెంగళూరు, కోల్‌కతా, పాట్నాలలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,01,170, 22 క్యారెట్ల బంగారం రూ. 92,940గా ఉంది. వెండి ధర రూ. 1,16,900 వద్ద ఉంది. ఈ ధరల వ్యత్యాసాలకు స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, డిమాండ్ వంటి అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు.

ధరల తగ్గుదలకు కారణాలు

బంగారం, వెండి ధరల తగ్గుదలకు అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలపై ఒత్తిడి పెరిగింది. డాలర్ బలంగా ఉన్నప్పుడు, బంగారం కొనుగోలు ఖర్చు ఎక్కువ అవుతుంది. దీనివల్ల డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా, బంగారం ధరలు తగ్గుముఖం పడతాయి. ఇటీవలి కాలంలో బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. దీనివల్ల పెట్టుబడిదారులు తమ లాభాలను కాపాడుకోవడానికి బంగారం అమ్మకాలవైపు మొగ్గు చూపారు. ఈ అమ్మకాల ఒత్తిడి ధరల తగ్గుదలకు దారితీసింది. ఇదే సమయంలో వెండి ధరలు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.

## విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్దపీట

మనగళం నంద్యాల కలెక్టరేట్ : విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో నంద్యాల పట్టణానికి చెందిన అశ్రప్ ఉన్నిసా అనే దివ్యాంగ మహిళకు ఉచితంగా వీల్ చైర్ అందజేశారు. ఈమె గత పిజిఆర్ఎస్ సమావేశంలో తనకు వీల్ చైర్ కావాలని అర్జీ సమర్పించడం జరిగిందన్నారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి... వీల్ చైర్ ను మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా నేడు బాధిత మహిళకు కలెక్టర్ చేతుల మీదుగా వీల్ చైర్ అందజేశారు. తన సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించినందుకు కలెక్టర్ కు అశ్రప్ ఉన్నిసా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు




**- రూ. 50, వేలు విలువ ఎగ్ కార్ట్ ను డ్వాక్రా మహిళలకు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల: మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎగ్ కార్టు లను అందజేయడం జరిగిందన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పిజిఆర్ఎస్ హాల్లో నంద్యాలకు చెందిన ఇదాయతున్, కళ్యాణి అనే ఎస్ హెచ్ జి మహిళలకు ఎగ్ కార్ట్ లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఆర్డీఏ వెలుగు శాఖల ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల అభివృద్ధికి ఎగ్ కార్ట్ లను ఇవ్వడం జరిగిందన్నారు. ఇవి మన జిల్లాకు మొత్తం 100 కార్టులు అందజేయడం లక్ష్యం కాగా... అందులో మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన వారికి 40 ఎగ్ కార్టులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన వాటిని నిర్ణీత ధర చెల్లించిన వారికి అందజేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాకు 10 ఎగ్ కార్టులు వచ్చాయని చెప్పారు. వాటిని అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క ఎగ్ కార్ట్ 50 వేల రూపాయలు విలువ చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎవరైతే ఎస్ హెచ్ జి సభ్యులు తోపుడుబండ్ల మీద బజ్జీలు, పకోడీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారో వారిని గుర్తించి తోపుడు బండి లాంటివి లేకుండా నూతనంగా ఏర్పాటుచేసిన ఎగ్ కార్ట్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎగ్ కార్ట్ ద్వారా కస్టమర్లకు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని ఇందులో తప్పకుండా ఎగ్ వెరైటీ ఫుడ్స్ చేయాలన్నారు. గుడ్డు తినడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, వీరు చేసే వంటకాలలో గుడ్డు ఉండేటట్లు చూడాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్డిఏ పీడీ, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు ఫిర్యాదులకు పరిష్కారం

**- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ముందుగా గార్గేయపురం డంప్ యార్డుల్లో ఘన వ్యర్థాలతో 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్లాంట్ నిర్మాణ ప్రక్రియపై జపాన్ దేశానికి చెందిన నిపుణులతో కమిషనర్ చర్చించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ శ్రీనివాసులు, డిఈఈ గంగాధర్, క్రిష్ణలత, ఏఈ వైష్ణవి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.




## ఇదేదో అల్లాటప్పా ఆకురాయి కాదండోయ్..!

మనగళం, ఈ వజ్రం బరువు 2,492 క్యారెట్లు. ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వజ్రంగా నిలిచింది. దీనిని ఆగస్టు 2024లో కెనడియన్ మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కార్ప్ కనుగొంది. ప్రపంచంలోనే అతిపెద్ద వజ్రం కుల్లినన్ వజ్రం. దీని బరువు 3,106 క్యారెట్లు, 1905 లో దక్షిణాఫ్రికాలో గుర్తించారు. ఈ వజ్రం నిర్మాణం, పారదర్శకత, పరిమాణం దీనిని చాలా అరుదుగా, విలువైనదిగా చేస్తాయి. భవిష్యత్తులో దీనిని మిలియన్ల డాలర్లకు అమ్మనున్నారు.. బోట్స్వానా ఆర్థిక వ్యవస్థకు వజ్రాల ఎగుమతులు 80 శాతానికి పైగా దోహదం చేస్తాయి. ఈ వజ్రాల అమ్మకం ద్వారా మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో పెట్టుబడి పెట్టగల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. ఇప్పుడు వజ్రాన్ని ప్రాసెసింగ్ కోసం పంపించారు. అక్కడ దానిని చాలా చిన్నవిగా కానీ, చాలా విలువైన వజ్రాలుగా కత్తిరిస్తారు. బోట్స్వానా గనులు ఇంతకు ముందు కూడా చాలా పెద్ద వజ్రాలను ఉత్పత్తి చేశాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈ రోజు (17.08.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం అభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళ మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు



మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (18.08.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది ఆర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతోంది.





## పల్లకీ ఉత్సవం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (17.08.2025) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తోంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది... అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడుతాయి.

## ఆగష్టు 18న వైద్య శిబిరం



మనగళం శ్రీశైలం : స్థానికులు మరియు భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వైద్యశాలలో ఆగష్టు 18వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుంది. ఈ వైద్య శిబిరం ఉదయం గం. 9.00ల నుంచి ఏర్పాటు చేయబడుతుంది. ఈ వైద్యశిబిరంలో వైద్య నిపుణులచేత ఎముకలు, నరాలు, కండరాలు, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందజేయబడుతాయి. అలాగే చిన్నపిల్లలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ తాడిపత్రి వాస్తవ్యులైన శ్రీ యం. మల్లికార్జుననాయుడుగారి సహకారంతో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేవస్థానం సిబ్బంది, స్థానికులు మరియు యాత్రికుల సౌకర్యార్థం ఈ ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారు ఈ శిబిరంలో వైద్యసేవలు పొందాలన్నారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (17.08.2025) శ్రీ మయూరి నృత్యాలయ, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో మహాగణపతిం, పంచాక్షరి, నీలకంఠానీరాజన, సాంబసదాశివా, శంభో....శివశంభో తదితర గీతాలకు నిత్య,మనస్విని, మన్విత, నందిత, అక్షర, పూజశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం,భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా కార్యక్రమా లు నిత్యకళారాధన నిర్వహించబడుతున్నాయి.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని అన్నదానానికి భారీ విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ పి. చిన్న శంకరప్ప, కర్నూలు వారు ఈ రోజు (18.08.2025)న ఈ దేవస్థాన శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం రూ. 5,00,116 /-లు మరియు గో సంరక్షణ పథకానికి విరాళం రూ. 5,00,116/-. లను అందజేశారు మొత్తానికి సంబంధించిన బ్యాంకు చెక్కులను కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి

## శ్రీశైలం డ్యాం పదిగేట్లను ఎత్తిన అధికారులు







మనగళం శ్రీశైలం : శ్రీశైలం జలాశయానికి సోమవారం సాయంత్రం భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో డ్యాం 10 గేట్లను పది అడుగుల మేరా ఎత్తి నాగార్జున సాగర్కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నుంచే వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. రాత్రికి సుంకేసుల ప్రాజెక్టు నుంచి భారీగా వరద వచ్చి చేరే అవకాశం ఉంది. ఇప్పటికే 2,53,819 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి చేరగా.. 10 గేట్ల ద్వారా 2,66,060 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు





మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (18.08.2025) శ్రీ నటరాజడాన్స్ అకాడమి, కడప వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో శ్రీ గణనాదం, మూషికకవాహన, శివతాండవం, ఓం నమ:శివాయా, అమ్మా పరమేశ్వరి, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు జయశ్రీ, ప్రతిభ, హిమబిందు, అనిత, శరణ్య, హేమవర్షిక, బద్రినాథ్, క్రాంతికుమార్ తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల నిర్వహించబడుతున్నాయి. పరిరక్షణలో ఈ భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక
జనరల్ న్యూస్
మంగళవారం
19 - 08 - 2025


# నీతి, నిజాయితీలకు నిలువుటద్ధంగా,పెద్దాయనగా అందరి మన్ననలు పొందిన ఆదర్శ సుపరిపాలకుడు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి జీవిత చరిత్ర

మన గళండోన్ నీతి,నిజాయితీలకు నిలువుటద్ధంగా,పెద్దాయనగా అందరి మన్ననలు పొందిన ఆదర్శ సుపరిపాలకుడు, పేద,రైతులపాలిటి పెన్నిధిగా, పక్షపాతిగా పేరుగాంచి,

చెప్పిన మాటకు,ఇచ్చిన హామీలకు కట్టుబడే వ్యక్తి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు కోట్ల విజయ భాస్కరరెడ్డి గారు. అడుగడుగునా స్వార్థం,అవినీతి పెన వేసుకుపోయిన నేటి రాజకీయాలలో కోట్ల లాంటి వ్యక్తులు టార్చిలైటు వేసి వెదికినా కానరారు.తన హయాంలో ఎన్నో, మరెన్నో ఉన్నత పదవులు వరించి నప్పటికీ అవినీతి మరక అంటని విలక్షణ రాజకీయ వేత్త పెద్దాయనగా పేరుగాంచిన వ్యక్తి కోట్ల విజయభాస్కరరెడ్డి.

**బాల్యము-విద్యాభ్యాసం:**

విజయభాస్కర రెడ్డి1920 ఆగష్టు 16 న కర్నూలు జిల్లాలోని లద్దగిరి గ్రామములో జన్మించాడు.మదనపల్లె థియోసాఫికల్ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. ఇక్కడ కళాశాలలో ఉన్నప్పుడే చిత్తూరు జిల్లా స్టూడెంట్స్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడైనారు.

మదనపల్లెలో ఉన్నప్పుడే రెండోప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటీష్ వారి తరఫున పాల్గొని లాఠీదెబ్బలు తిని స్పృహకోల్పోయారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం కూడా గడిపాడు. తమిళనాడులోని మద్రాసులోని మద్రాస్ లా కళాశాలలో న్యాయశాస్త్ర విద్య అభ్యసించారు. లాయర్ గా కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశారు.

**కుటుంబం:**

ఈయనకు భార్య శ్యామలా దేవి, ఇద్దరు కుమారులు (సూర్యప్రకాశ్ రెడ్డి, రమేష్ రెడ్డి), ముగ్గురు కుమార్తెలు (వాసంతి, ఇందుమతి, వరలక్ష్మి) కలరు. సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రస్తుతం డోన్ శాసనసభ్యులుగా పనిచేస్తున్నారు. విజయ భాస్కరరెడ్డి సెప్టెంబర్ 27, 2001 న మరణించాడు.

**రాజకీయ జీవితం:**

గ్రామ పంచాయతీలో రాజకీయాల్లో తన ప్రమేయాన్ని ప్రారంభించి , చివరికి జాతీయ స్థాయిలో రాణించారు.1950లో రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించి కర్నూలు జిల్లా పరిషత్తు అధ్యక్షుడిగా ఎన్నికైనారు. కాసు బ్రహ్మానందరెడ్డి ఇతని శైలి చూసి ఎమ్మెల్యే కాకున్నానూ తన మంత్రివర్గంలో చోటు కల్పించి తర్వాత ఎమ్మిగనూరు నుంచి గెలిపించారు.తొలిసారి 1955లో ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. 2సార్లు కర్నూలు జిల్లా పరిషత్తు చైర్మెన్‌గా పనిచేశాడు. మొత్తం 5 సార్లు శాసనసభకు,6సార్లు పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా, 2 సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగినాడు. విజయ భాస్కర రెడ్డి 6సార్లు కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యాడు.మొదటిసారి 1977లో ఆరవ లోక్‌సభకు ఎన్నికవగా, మధ్యలో 8 వ లోక్‌సభకు మినహా 12వ లోక్‌సభ వరకు వరుసగా ఎన్నికైనాడు.1982 మరియు 1992లలో ముఖ్యమంత్రి పదవి పొందారు. కేంద్రంలో ఇందిరాగాంధీ,రాజీవ్ గాంధీ, పివి నరసింహరావు మంత్రి వర్గాలలో పనిచేశారు.తన సుధీర్ఘ రాజకీయ జీవితంలో అవినీతి ఆరోమణలు లేకుండా కొనసాగారు.

**క్రీడలు, ఆటలు మరియు చదవడం.....**

క్రీడలు,ఆటలు మరియు చదవడం అంటే విజయ భాస్కర్ రెడ్డికి చాలా ఇష్టం ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లిలోని బెసెంట్ థియోసాఫికల్ కళాశాలలో హాకీ మరియు ఫుట్‌బాల్ జట్లకు కెప్టెన్‌గా మరియు 1967 నుండి 1969 వరకు ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన కర్నూలు జిల్లాలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచారు. వారి ఏరియాలో వ్యవసాయ భూములను అభివృద్ధి చేశారు.

**పరిపాలన-కొన్ని విశేషాలు:**

కర్నూలు జిల్లా అంతటా గ్రామాల్లో 15 ప్రాథమిక మరియు మాధ్యమిక పాఠశాలలను ప్రారంభించిన ఘనత పొందారు. ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6%-%11 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు.

పేద కుటుంబాలకు కిలోకు రూ.1.90 అధిక సబ్సిడీ రేటుకు బియ్యం సరఫరా చేయడంలో కూడా ఆయన ప్రసిద్ధి చెందారు.

**అభివృద్ధి, సంక్షేమం:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రగతి పథంలో ఎన్నో మైలురాళ్లు సాధించి, పల్లె పల్లెకు తాగునీరు- సాగునీరు అందించడమే కాకుండా రోడ్లు, గృహాలు,విద్య, వైద్య, ఆరోగ్యం ప్రాధాన్యత ఇచ్చి రైతులకు భూమి హక్కు పత్రములను ఇచ్చిన ముఖ్యమంత్రి భారత దేశంలో కోట్ల విజయ భాస్కరరెడ్డి మొదటి వ్యక్తి.రాష్ట్రంలో విద్యాభివృద్ధికి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టిన ఘనత కోట్లకే దక్కుతుంది. రైతులకు రూ.50/- లకే విద్యుత్ అందించడమే కాకుండా, బడుగు,బలహీన వర్గాలకు శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టి, మహిళల ఆత్మ గౌరవం కోసం ఏకంగా మద్య పానాన్ని నిషేధించి, డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు, కె.సి. కెనాల్, ఎల్.ఎల్.సి. ఆధునీకరణ పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించారు.

**నిజాయితీపై సర్వే జరుపగా...**



ఇతర రాజకీయ నాయకులు మాదిరిగా కాకుండా, ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు.1991లో ఇలస్ట్రేటెడ్ వీక్లీ కేంద్రంలోని మంత్రుల నిజాయితీపై సర్వే జరుపగా అవినీతి ఆరోపణలు లేని వ్యక్తిగా కోట్ల ప్రథముడిగా నిలిచారు. వారింటికి ఎవరు వచ్చినా అతిథుల్ని గౌరవించి, వారు భోజనం చేయకుండా వెళ్ళనిచ్చే వారు కాదు. ఇప్పటికీ ఈ సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

- ఆయన మరణం తరువాత, రాష్ట్ర ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం "కిసాన్ ఘాట్"ను నిర్మించింది.
- ఈయన పేరు గుర్తుండేలా హైదరాబాద్ లో క్రీడా స్టేడియంను నిర్మించారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత విజయ భాస్కరరెడ్డి.వారి స్ఫూర్తి తరతరాల పాటు వెలుగునిచ్చే దీప్తి అనడంలో ఎటువంటి సందేహం లేదు.అవినీతి ఆరోపణలు లేని వ్యక్తిగా రాజకీయాలలో చిరస్మరణీయుడు అనడంలో సందేహం లేదు.

## గాయంతో ఇషాన్ కిషన్ ఔట్.. దేశవాళీ హీరోకు కెప్టెన్సీ..!


మన గళం: ఏడాది కాలంగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ ఆసియా కప్ ముందే గాయపడ్డాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టి.. పునరాగమనం చేస్తాడనుకుంటే.. దులీఫ్ ట్రోఫీ నుంచి అనూహ్యంగా దూరమయ్యాడు. ఈస్ట్ జోన్ సారథిగా ఎంపికైన ఈ చిచ్చరపిడుగు మెగా టోర్నీలో ఆడడం లేదని ధ్రువీకరించిన ఒడిశా క్రికెట్ సంఘం అతడి స్థానంలో మరో ఆటగాడిని తీసుకుంది. ఇషాన్ బదులు 27 ఏళ్ల ఆశీర్వాద్ స్వెయిన్‌ను స్క్వాడ్‌లోకి రాగా.. వైస్ కెప్టెన్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్ జట్టును నడిపిస్తాడని ఈస్త్ జోన్ సెలెక్టర్లు తెలిపారు. 'ఇషాన్ కిషన్ గాయంతో దులీప్ ట్రోఫీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో ఒడిశా వికెట్ కీపర్, బ్యాటర్ ఆశీర్వాద్ స్వెయిన్ ఈస్ట్ జోన్ స్క్వాడ్‌లోకి తీసుకున్నాం. సందీప్ పట్నాయక్‌కు అతడు బ్యాకప్‌గా ఉంటాడు. యువకెరటం స్వస్తిక్ సమాల్‌ను స్టాండ్ బైగా ఎంపిక చేశాం' అని ఒడిశా క్రికెట్ సంఘం సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. దులీప్ ట్రోఫీలో ఆగస్టు 28న నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో సెంచరీతో మెరిసిన ఇషాన్ జాతీయ జట్టులో చోటు కోసం నిరీక్షిస్తున్నాడు. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ మాంచెస్టర్ టెస్టులో పంత్ గాయపడిన తర్వాత అతడికి పిలుపు వస్తుందని ఊహించారంతా. కానీ, ఇషాన్ మాత్రం అయిష్టం చూపించడంతో తమిళనాడుకు చెందిన ఎన్ జగదీశన్‌ను ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఈస్ట్ జోన్ స్క్వాడ్ : అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్, దినేశ్ దాస్, శ్రీదామ్ పాల్, శరన్‌దీప్ సింగ్, కుమార్ కుషగ్ర, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, మహ్మద్ షమీ, ఆశీర్వాద్ స్వెయిన్. స్టాండ్ బై ప్లేయర్లు : ముఖ్తర్ హుస్సేన్, వైభవ్ సూర్యవంశీ, స్వస్తిక్ సమాల్, సుదీప్ కుమార్, రాహుల్ సింగ్.



## వరల్డ్ కప్ బరిలో అమెరికా, టాంజానియా..

మన గళం :పురుషుల అండర్ -19 వరల్డ్ కప్ పోటీలకు అమెరికా అర్హత సాధించింది. క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ బెర్తు సాధించింది యూఎస్ఏ. దాంతో, మెగా టోర్నీ బరిలో నిలిచిన జట్ల సంఖ్య 16కు చేరింది. రెండేళ్ల క్రితం టాప్-10లో నిలిచిన జట్లతో పాటు ఆతిథ్య జింబాబ్వే అర్హత సాధించింది. మిగతా ఆరు స్థానాలను క్వాలిఫయర్స్ విజేతలు సొంతం చేసుకున్నాయి. జింబాబ్వే, నమీబియా వేదికగా వచ్చే ఏడాది అండర్ -19 ప్రపంచ కప్ జరుగనుంది. గత ఎడిషన్ ఫైనల్ చేరిన భారత్, ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్‌లో మెరుగైన రన్‌రేటు కారణంగా అఫ్గనిస్థాన్, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో నమీబియాను ఓడించిన టాంజానియా బెర్తు దక్కించుకున్నాయి.

రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ టోర్నీలో ఒక్కో దాంట్లో నాలుగు చొప్పున నాలుగు గ్రూప్‌లు ఉంటాయి. ఈస్ట్ ఆసియా ఫసిఫిక్ క్వాలిఫయర్‌లో ఆడిన జపాన్, స్కాంట్లండ్ క్వాలిఫై అయ్యాయి. అమెరికా క్వాలిఫయ్సర్స్‌లో కెనడా, బెర్ముడా, అర్జెంటీనాకు షాకిచ్చిన అమెరికా వరల్డ్ కప్ రేసులోకి దూసుకొచ్చింది. వరల్డ్ కప్ బరిలో ఉన్న జట్లు ఇవే.. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే, అఫ్గనిస్థాన్, జపాన్, స్కాట్లాండ్, టాంజానియా, యూఎస్ఏ.



## ఆసియా కప్.. ఆకాశాన్నంటుతున్న ప్రకటనల రేట్లు.. రికార్డ్స్ బ్రేక్

మన గళం వచ్చే నెలలో జరగనున్న ఆసియా కప్‌లో భారత్, పాక్‌లు తలపడనున్నాయి. సెప్టెంబర్ 14న దుబాయ్ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో ఉత్కంఠ పీక్స్‌కు చేరుకుంది. మరోవైపు, భారత్‌లో ఆసియా కప్‌కు సంబంధించి లైవ్ టెలికాస్ట్, స్ట్రీమింగ్ రైట్స్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌ల సందర్భంగా ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వాలనుకునే వారి కోసం సంస్థ యాడ్ రేట్ కార్డును కూడా విడుదల చేసినట్టు తెలుస్తోంది. మ్యాచ్ సమయంలో 10 సెకెన్ల నిడివి ఉన్న టీవీ యాడ్‌కు రూ.16 లక్షల ధరను నిర్ణయించిందన్న వార్త వైరల్‌గా మారింది. యాడ్ ధరలు ఈ రేంజ్‌లో ఉన్నాయంటే ఈ మ్యాచ్‌కు ఆదరణ ఎంతలా ఉండబోతోందో తెలుస్తోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక సెప్టెంబర్ 9 నుంచి 28వ తేదీ వరకూ ఆసియా కప్ టోర్నీ జరగనుంది. ఇందులో భాగంగా దుబాయ్, అబుదాబీ వేదికల్లో 8 జట్ల మధ్య మొత్తం 19 టీ20 మ్యాచులు జరగనున్నాయి. ఇక భారత్ పాక్ మధ్య దుబాయ్ వేదికగా సెప్టెంబర్ 14న హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో భారత్, పాక్, యూఏఈ, ఒమాన్ జట్లు గ్రూప్ ఏలో, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ జట్లు గ్రూప్ బీలో ఉన్నాయి.



## జ్యూరిచ్ డైమండ్ లీగ్ ఫైనల్‌కు దూసుకెళ్లిన నీరజ్ చోప్రా..

మన గళం :జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరోసారి వార్తల్లో నిలిచాడు. ఈసారి డైమండ్ లీగ్ 2025 ఫైనల్లో జ్యూరిచ్‌కు చేరుకున్నాడు. సిలేసియాను మిస్ చేసినప్పటికీ, నీరజ్ తన 15 పాయింట్లతో ఆరుగురు అథ్లెట్లలో ఒకడిగా ఫైనల్‌కు క్వాలిఫై అయ్యాడు. ప్రస్తుతం నీరజ్ డైమండ్ లీగ్ స్టాండింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్నాడు. అతని ముందు కేషోర్న్ వాల్‌కాట్ (17 పాయింట్లు), జూలియన్ వెబర్ (15 పాయింట్లు) ఉన్నారు. నీరజ్ ఈ సీజన్‌లో రెండింటిలో పాల్గొన్నాడు.

ఓ స్పెషల్ ఈవెంట్

మే నెలలో దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ 90.23 మీటర్ల త్రోతో అద్భుతంగా రాణించాడు. కానీ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఆ తర్వాత జూన్‌లో పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్ల త్రోతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ రెండు ఈవెంట్‌లలోనూ నీరజ్ తన సత్తా చాటాడు. జూలై 5న బెంగళూరులో జరిగిన ఈవెంట్‌లో నీరజ్ 86.18 మీటర్ల త్రోతో మొదటి స్థానం సాధించాడు.

చల్లని వాతావరణంలో

కెన్యా మాజీ వరల్డ్ ఛాంపియన్ జూలియస్ యెగో 84.51 మీటర్లతో రెండో స్థానంలో, శ్రీలంక రుమేష్ పతిరాగే 84.34 మీటర్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ఈవెంట్‌లో జర్మనీ థామస్ రోహ్లర్, అమెరికా కర్టిస్ థాంప్సన్, బ్రెజిల్ లూయిజ్ మౌరీసియో డా సిల్వా, పోలాండ్ సైప్రియన్ మర్జిగ్లోడ్ వంటి వరల్డ్-క్లాస్ అథ్లెట్లు పాల్గొన్నారు. బెంగళూరులో చల్లని వాతావరణంలో అథ్లెట్లు తమ త్రోల తర్వాత జాకెట్లు వేసుకుని కనిపించారు. ఇలాంటి సవాళ్ల మధ్య కూడా నీరజ్ తన బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఇది తన డెడికేషన్‌ను, ఫోకస్‌ను చూపించిందని చెప్పవచ్చు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310